# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-04-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **దేశ ప్రజల స్వప్నాలను సాకారం చేయడమే తన లక్ష్యమని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

**2.** **18 సంవత్సరాల వయసు నిండి.. ఓటర్ జాబితాలో పేరులేని వారంతా ఈరోజులోగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు.**

**3.** **తెలంగాణాలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెల 3వ తేదీ నుండి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి వస్తే పేదలకు రెండు సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించి ఇస్తామని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.**

**5.** **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈరోజు, రేపు తీవ్ర వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.**

==========================

దేశ ప్రజల స్వప్నాలను సాకారం చేయడమే తన లక్ష్యమని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మధ్యప్రదేశ్ లోని పిపారియాలో నిన్న ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ... అణు నిరాయుధీకరణ తో దేశాన్ని రక్షించడం సాధ్యం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. శత్రుదేశాలు ఎంతో అణ్వాయుధ శక్తి కలిగి ఉన్న నేటి ప్రపంచంలో... మన దేశాన్ని రక్షించుకోవాలంటే అణ్వాయుధాలు ఉండాల్సిందేనని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

--------------------------

18 సంవత్సరాల వయసు నిండి.. ఓటర్ జాబితాలో పేరులేని వారంతా ఈరోజులోపు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. ఆన్‌లైన్ ద్వారా గానీ , సంబంధిత రెవెన్యూ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో గానీ ఫారం-6ను సమర్పించడం ద్వారా ఈరోజులోపు ఓటు హక్కు నమోదు చేసుకున్నవారందరికీ తప్పకుండా ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు కావడమే కాకుండా మే 13న జరిగే పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

--------------------------

తెలంగాణాలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను వచ్చేనెల 3వ తేదీన ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యే ఉద్యోగులు, కేంద్ర సర్వీసుల్లో పనిచేసే సిబ్బంది, దివ్యాంగులు, 85 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది.. ఈ అవకాశం ఎంచుకున్న దివ్యాంగులు, వయోవృద్ధులు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి నుంచి ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు రెండో విడత శిక్షణ సందర్భంగా ఏర్పాటుచేసే ఫెసిలిటీ కేంద్రంలో ఓటు వేసేందుకు ఏర్పాట్లు ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

---------------------------

వై. ఎస్ .ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. ఎస్. జగన్ మోహన రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈ రోజు కృష్ణాజిల్లా కేసరపల్లి నుండి ప్రారంభమవుతుంది. గన్నవరం, ఆత్కూర్, వీరవల్లి క్రాస్, హనుమాన్ జంక్షన్ మీదుగా యాత్ర జొన్నపాడు చేరుకుంటుంది. సాయంకాలం 4 గంటలకు నాగవరప్పాడు చేరుకొని అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తరువాత తిరిగి హనుమాన్ జంక్షన్‌కు చేరుకుని ... కలపర్రు మీదుగా రాత్రికి యాత్ర ఏలూరు జిల్లాలోకి ప్రవేశిస్తుంది.

---------------------------

దేశంలో ఉత్తర, దక్షిణ, తూర్పు ప్రాంతాలకూ బుల్లెట్ రైళ్ల సేవలు విస్తరిస్తామని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు. ఢిల్లీలో నిన్న 'సంకల్ప్ పత్ర' పేరిట భారతీయ జనతా పార్టీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ అహ్మదాబాద్– ముంబయి బుల్లెట్ రైలు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయనీ, వీటికి సంబంధించిన అధ్యయనం కూడా త్వరలోనే ప్రారంభమవుతుందని వివరించారు. ఇప్పటి వరకు సాధించిన అనుభవాలతో దేశంలోని ఉత్తర, దక్షిణ, తూర్పు ప్రాంతాలకు బుల్లెట్ రైలు సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు బీజేపీ కట్టుబడి ఉందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

---------------------------

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో పట్ల కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి వ్యక్తం చేసింది. దేశంలో రైతులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ఆ పార్టీ తన మేనిఫెస్టోలో విస్మరించిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ వారికి కనీసం మద్దతు ధర కల్పించడంలో కూడా విఫలమయ్యారనీ, ఆయన తన హయాంలో ఏ వర్గానికి మేలు చేకూర్చలేదని మల్లిఖార్జున్ ఖర్గే అన్నారు.

---------------------------

వచ్చే లోక్‌సభ ఎన్నికలలో కేంద్రంలో ఇండియా కూటమే అధికారంలోకి వస్తుందని తెలంగాణా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.తెలంగాణా నుండి లోక్‌సభకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులతో హైదరాబాదులో నిన్న ఆయన సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అనుసరించవలసిన వ్యూహంపై వారితో చర్చించారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను కాంగ్రెస్ పార్టీ మాత్రమే పరిష్కరిస్తుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం, జన సేన, భారతీయ జనతా పార్టీల కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తామని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. విశాఖపట్నం జిల్లా గాజువాక, పాయకరావు పేటలలో నిన్న జరిగిన ఎన్నికల సభలలో ఆయన మాట్లాడుతూ .... గత ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాలను రద్దు చేయబోమని స్పష్టం చేశారు. వృద్ధాప్య, వితంతు పింఛన్ల ను ఏప్రిల్ నెల నుండే అమలు చేస్తామని కూడా హామీ ఇచ్చారు. తల్లికి వందనం కార్యక్రమం కింద ప్రతీ మహిళకు 15 వేల రూపాయల మేర అందజేస్తామనీ, ఉచితంగా మూడు సిలిండర్లను సమకూరుస్తామనీ, ఆర్.టి. సి. బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కలిపిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కూటమి అధికారంలోకి వస్తే, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో నిన్న జరిగిన వారాహి యాత్రలో ఆయన మాట్లాడుతూ .... ఉద్యోగులకు ప్రతి నెలా అయిదవ తేదీలోపు వేతనాలు చెల్లిస్తామనీ , వ్యాపార వర్గాలకు అండగా ఉంటామనీ హామీ ఇచ్చారు. ప్రతి మహిళా ఏదో ఒక రంగంలో నైపుణ్యం పెంపొందించుకునే విధంగా పథకాలు అమలు చేస్తామనీ, రాష్ట్ర సమస్యలపై సమగ్ర చర్చ జరపడం ద్వారా ప్రజాస్వామ్య సంప్రదాయాలకు అనుగుణంగా అసెంబ్లీని నిర్వహిస్తామనీ, ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ అంశంపై ఏడాది లోగా పరిష్కారం చూపుతామని కూడా పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

---------------------------

వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై. ఎస్ జగన్ మోహన రెడ్డి పై విజయవాడలో జరిగిన ఘటనపై ఆ పార్టీ ప్రతినిధి బృందం నిన్న రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాను విజయవాడలో నిన్న కలుసుకుని ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించింది. ముఖేష్ కుమార్ మీనాను కలుసుకున్న అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ .... జగన్ మోహన రెడ్డిపై జరిగిన దాడి ఘటనపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు.

---------------------------

వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ..... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డిపై జరిగిన దాడి ఘటనపై విచారణ కోసం రాష్ట్ర పోలీసులు ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు సూపరింటెండెంట్ అధికారి నేతృత్వంలో ఈ ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేస్తూ విజయవాడ నగర పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు వివరాలను అందుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇప్పటికే విచారణ ప్రారంభించాయి.

---------------------------

ఒక పాఠశాల నుండి వేరొక పాఠశాలకు బదిలీ అయ్యే విద్యార్థులు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు తీసుకోవాల్సిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ స్పష్టం చేశారు. టీసీలు, జనన

ధ్రువీకరణ పత్రాలను తీసుకోవడంలో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, ఫలితంగా డ్రాపౌట్ల సంఖ్య పెరుగుతోందని ఆయన వివరించారు. దీనిని నివారించేందుకు టీసీలు తప్పనిసరన్న నిబంధనను సడలించినట్టు తెలిపారు.

---------------------------

తెలంగాణాలోని భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి కల్యాణ బ్రహ్మోత్సవంలో భాగంగా నిన్న గరుడాధివాసం నిర్వహించారు. అత్యంత పవిత్రమైన వస్త్రంపై ధ్వజపటాన్ని లిఖించారు. ఈ పటాన్ని మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ ఆలయానికి తీసుకురావడాన్ని అధివాసంగా పేర్కొన్నారు. ఈ వేడుకతో పాటు భేరి పూజ, దేవతాహ్వానం, అగ్ని ప్రతిష్ఠాపన ఉంటుందని.. ఈరోజు ధ్వజారోహణం చేస్తారని ఆలయ కార్య నిర్వహణాధికారి వెల్లడించారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో ఈరోజు, రేపు తీవ్ర వడగాలులు వీస్తాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రోజు 31 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 139 మండలాల్లో వడగాల్పులు.. రేపు 33 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 113 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు తెలియచేసింది. నిన్న నంద్యాల జిల్లా గోస్పాడులో 43.4 డిగ్రీలు, విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 43.3 డిగ్రీలు, ఆముదాలవలసలో 42.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొంది.

అటు.. తెలంగాణాలో నిన్న ఏడు జిల్లాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో రెండు నుంచి మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ లోని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

======================